జోరుగా ఇసుక అక్రమ రవాణా

- అనుమతుల్లేకుండా తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- అడిగితే ప్రభుత్వ పనులంటూ బుకాయింపు
- చర్యలు చేపట్టాలని డిమాండ్

అక్రమార్కులు ఇసుక వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. వేకువ జామునే నంబర్ ప్లేట్లు లేని ఇసుక ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. ఏకంగా పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయం ముందు నుంచే వెళ్తున్నా అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అడిగితే ప్రభుత్వ పనులంటూ బుకాయిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



జనగామ వాగులో ట్రాక్టర్‌లో ఇసుకను నింపుతున్న యువకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని జనగామ వాగును అక్రమార్కులు తోడేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.3500 నుంచి రూ.5 వేల చొప్పున అమ్ముకుంటున్నారు. ఇష్టారాజ్యంగా వాగును తోడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వాగులో నిత్యం పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లలో మండలంలోని అంతక్కపేట, జనగామ, గౌరవెల్లి, మల్లంపల్లి, చౌటపల్లి గ్రామాలతో పాటు హుస్నాబాద్ పట్టణానికి ఇసుకను తరలిస్తున్నారు. ఈ వ్యవహారం బహిరంగంగా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. వాహన నిబంధనల మేరకు వాహనానికి నంబరు ప్లేట్ తప్పనిసరిగా ఉండాలి. కానీ, ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు నంబరు ప్లేట్లు లేవు. నంబర్ ఉంటే ట్రాక్టర్లను పట్టుకుంటారన్న ఆలోచనతో అక్రమార్కులు కొత్తపంథా ఎంచుకున్నారు. అంతేకాకుండా రోడ్లపై అతివేగంగా, రాంగ్‌రూట్లలో ట్రాక్టర్లను నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

ప్రభుత్వ ఫీజు చెల్లించి..

కొందరు ప్రభుత్వ పనులకు ఇసుకను తరలిస్తున్నామంటూ ప్రైవేటు వ్యాపారం చేసుకుంటున్నారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. వాస్తవానికి భవన నిర్మాణాలకు ప్రభుత్వ ఫీజు చెల్లించి అధికారుల అనుమతి మేరకు రవాణా చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటి నిబంధనలు పాటించడం లేదు. ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేవు



ఇసుక రవాణాకు అనుమతులు ఎవరికీ ఇవ్వలేదు. వాగు, నుంచి ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఉండటంతో గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే నిమిషాల్లో సమాచారం వచ్చేది. ఇప్పుడు గ్రామాల్లో ఏమి జరుగుతుందో తెలియడంలేదు. ఇసుకను తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు చెబుతాం.
– సంజీవ్‌కుమార్, తహసీల్దార్, అక్కన్నపేట మండలం

ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శివరంజని

ప్రిన్సిపల్ సివిల్ జూనియర్ జడ్జి శివరంజని

హుస్నాబాద్: ఈనెల 16వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీస్ అధికారులు కృషి చేయాలని హుస్నాబాద్ ప్రిన్సిపల్ సివిల్ జూనియర్ జడ్జి శివరంజని అన్నారు. శనివారం కోర్టు హాల్‌లో పోలీస్ అధికారులతో లోక్ అదాలత్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కోర్టు పరిధిలో చిన్న చిన్న కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, పోలీసులు వేసే చార్జిషీట్‌లో తప్పులు దొర్లుతున్నాయన్నారు. ప్రతీస్టేషన్ నుంచి వంద కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు జడ్జి కృష్ణతేజ్, ఏపీపీ రవికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఎక్సైజ్ సీఐ పవన్, ఎస్సైలు మహేష్, వివేక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ బస్టాండ్ సందర్శన

హుస్నాబాద్: హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ పనుల పర్యవేక్షణకు శనివారం కరీంనగర్ డివిజన్ ఆర్టీసీ ఈడీ వినోద్ కుమార్ బస్టాండ్‌ను సందర్శించారు. బస్టాండ్ ఆధునీకరణకు రూ.2 కోట్లు మంజూరు కాగా, పనులకు ఈనెల 8వ తేదీన మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేయనున్నారు. పనుల పర్యవేక్షణ, శంకుస్థాపన ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బస్టాండ్‌లోని స్టాల్స్, టాయిలెట్లను పరిశీలించారు. బస్టాండ్‌లో అదనంగా రెండు ఫ్లాట్ ఫాంలు, రెండు మోడ్రన్ టాయిలెట్ల నిర్మాణం, బస్టాండ్‌లో టైల్స్ ఏర్పాటుతో పాటుగా బస్టాండ్‌ను ఆధునీకరణ పనులకు సర్వే నిర్వహించారు. అనంతరం డిపోను తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్టీసీ సీసీఈ శ్రీనివాసరావు, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఆర్ఎంలు, సివిల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



హుస్నాబాద్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న కరీంనగర్ డివిజన్ ఈడీ వినోద్ కుమార్

క్లుప్తంగా

వన్ టైమ్ స్కీంను సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్: ఆస్తి పన్నుల బకాయిలను పూర్తిగా చెల్లించే వారికి ప్రభుత్వం వన్ టైం స్కీం అవకాశం కల్పించిందని, హుస్నాబాద్ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్నటు వంటి ఆస్తి పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించేవారికి 90 శాతం వడ్డీ మాఫీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలను పది శాతం వడ్డీతో 2024 మార్చి 31 లోపు చెల్లించాలన్నారు. అలాగే ఇంతక ముందే చెల్లించిన వారికి అడ్వాన్స్ రూపంలో రానున్న ఆర్థిక సంవత్సరానికి జమ చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ బాలమల్లయ్య

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఎనగుర్తి ప్రభుత్వ పాఠశాలలో మూఢనమ్మకాల నిర్మూలన, విద్య అవశ్యకత, మహిళల రక్షణపై భూంపల్లి పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ బాలమల్లయ్య మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవద్దని, తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిన తరుణంలో ఇప్పటికీ మూఢనమ్మకాలను విశ్వసించడం దురదృష్టకరమన్నారు. సైన్స్‌ను విద్యార్థులు సైనికుల్లా ముందుకు నడపాలన్నారు. మూఢనమ్మకాలపై సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ కార్మికులకు అందజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. శనివారం పట్టణంలోని 11, 15వ వార్డుల్లో ప్రతీ ఇంటికి రెండు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధులకు వచ్చే మున్సిపల్ వాహనానికి చెత్తను అందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

దూళ్మిట్ట తహసీల్దార్‌గా శ్యామ్

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల తహసీల్దార్‌గా శ్యామ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బెజ్జంకి బదిలీపై వెళ్లగా అక్కడ విధులు నిర్వహిస్తున్న శ్యామ్ ఇక్కడికి వచ్చారు. మండల పరిధిలోని భూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పోతరాజు విగ్రహ ప్రతిష్ఠ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయంలో శనివారం పోతరాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పోచయ్య, సంఘం అధ్యక్షుడు కనకయ్య, రాజమల్లు, కొమురయ్య, లక్ష్మణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్లగ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన బత్తిని కళావతి, సత్తయ్య దంపతులు రూ.30 వేల విలువగల కంప్యూటర్, ప్రింటర్ జిరాక్స్‌ను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలభాస్కర్, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి తహసీల్దార్‌గా ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన దూళ్మిట్ట మండలంలో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన శ్యామ్ దూళ్మిట్ట మండలానికి బదిలీ అయ్యారు. భూ సమస్యల పరిష్కారం కోసం నేరుగా తనను కలిస్తే సలహాలు సూచనలు ఇస్తామని నూతన తహసీల్దార్ తెలిపారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. దేవాదాయశాఖ ఏఓ విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ చొప్పరి మల్లేశం డైరెక్టర్లతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, కొమురవెల్లి ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి హాజరయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లింగాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఆలయ పాలకవర్గం

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, డంప్ చేసినా చర్యలు తప్పవని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. శనివారం దూళ్మిట్ట మండలంలోని జాలపల్లి శివారు వాగువద్ద ఇసుక అక్రమ డంప్‌లను గుర్తించి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల సర్కిల్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక డంప్ చేసిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థులు విక్రయించే వారు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచరం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ యూనూస్ అహ్మద్ అలీ, ఆర్‌ఐ ఐలయ్య ఉన్నారు.



ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్న సీఐ శ్రీను

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను కృష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మడక కృష్ణ శనివారం తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 8వ తేదీ సాయంత్రం వరకు జట్టు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.20 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.15 వేలు, తృతీయ బహుమతి కింద రూ.10 వేలు, నాల్గొవ బహుమతి కింద రూ.5 వేలు, ట్రోఫీ అందించనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు ఎంట్రీ ఫీజు ఉండదన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఘనంగా మార్కండేయ వార్షికోత్సవం

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి ఆలయ 28వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుద్రాభిషేకం, హోమం తదితర వైదిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్, కౌన్సిలర్లు నందాల శ్రీజ శ్రీకాంత్, కూరపాటి బంగారయ్య స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మార్కండేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్

సీపీని కలిసిన పోలీసు అధికారులు



పూల మొక్కల అందజేస్తున్న సీసీఎస్ ఏసీపీ జగదీష్‌చందర్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట సీసీఎస్ ఏసీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన జగదీష్ చందర్, సిద్దిపేట వన్‌టౌన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీబాబు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

షీటీమ్స్‌తో మహిళలకు భద్రత

పోలీసు కమిషనర్ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళలు, బాలికలకు షీటీమ్స్‌తో భద్రత, భరోసా కల్పిస్తున్నట్లు పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ షీటీమ్స్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు, సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల వారీగా షీ టీమ్స్ పనిచేస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే డయల్ 100, షీటీమ్ వాట్సప్ నంబర్ 87126 67434, పోలీసు కంట్రోల్ రూం 87126 67100కు సమాచారం అందించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డ్రగ్స్, మెడిసిన్, సర్జికల్ వస్తువులు, డయాగ్నొస్టిక్ కిట్స్, ఆర్థోపెడిక్ ఇంప్లాంట్స్, హాస్పిటల్ లినెన్, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, మెడికల్ ఎక్విప్‌మెంట్ సరఫరా కోసం అర్హులైన వారి నుంచి టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ శనివారం తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 15వరకు దరఖాస్తులు తీసుకుని ఈనెల 16వ తేదీ లోపు ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. సరఫరాకు రెండు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న సరఫరాదారులు మరిన్ని వివరాలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

బాల్యవివాహంపై అవగాహన

జగదేవ్‌పూర్(గజ్వేల్): బాలికకు వివాహం చేస్తున్నారని చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వడంతో ఐసీడీఎస్, బాలల సంరక్షణ అధికారులు గ్రామానికి చేరుకొని బాలికకు, ఆమె కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ధర్మారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన బాలిక తనకు వివాహం చేయతలపెట్టారని తెలుసుకొని మండలంలోని ధర్మారం గ్రామంలో ఉంటున్న బాబాయి ఇంటికి శుక్రవారం వెళ్లింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత, బాలల సంరక్షణ విభాగం అధికారి రాజు గ్రామానికి చేరుకొని బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చేస్తే జరిగే అనర్థాలను వివరించారు.

పోలియో చుక్కలు వేయించాలి

గజ్వేల్‌రూరల్: అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తల్లిదండ్రులు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా రిసోర్స్ పర్సన్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు చూడాలన్నారు.

స్వయం ఉపాధితో నైపుణ్యాలు మెరుగు

డీపీఎం కరుణాకర్

చిన్నకోదూరు(సిద్దిపేట): మహిళలు స్వయం ఉపాధితో జీవన నైపుణ్యాలు మెరుగు పర్చుకోవాలని డీపీఎం కరుణాకర్ అన్నారు. శనివారం చిన్నకోదూరు మండల సమాఖ్యలో వీఓఏలకు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ఆధ్వర్యంలో మహిళలకు లక్షాధికారులను చేయడం ఎలా అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం అందించే రుణాలు తీసుకుని మహిళలు ఆర్థికంగా బలపడాలన్నారు. చిన్నిచిన్న కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు చేపట్టి కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఏపీఎం మహిపాల్, టీఓటీ విజయనిర్మల, వీఓఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం కరుణాకర్

విద్యార్థుల ఇంటి వద్దనే బోధించాలి

చేర్యాల(సిద్దిపేట): ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రతీరోజు భవిత కేంద్రంలో బోధించడంతో పాటు కేంద్రానికి రాలేని వారికి ప్రతీ శనివారం వారి ఇంటి కెళ్లి బోధించాలని ఐఈ కో–ఆర్డినేటర్ రంగనాథ్ ఐఈఆర్పీలకు సూచించారు. శనివారం మండల పరిధిలో పర్యటించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ఐఈఆర్పీలు బోధిస్తున్న తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రాల్లో ప్రతీరోజు, కేంద్రానికి రాలేని వారి కోసం ప్రతీ శనివారం వారి ఇంటికే వెళ్లి విద్యను బోధిస్తారన్నారు. ఆయన వెంట ఐఈఆర్పీ అరుణ ఉన్నారు.



బోధన తీరు పరిశీలిస్తున్న ఐఈ కో–ఆర్డినేటర్ రంగనాథ్

సంక్షిప్త వార్తలు

◆ డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తిచేయండి

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో అసంపూర్తి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని కోరుతూ రెవెన్యూ డివిజన్ కార్యాలయ అడ్మినిస్ట్రేట్ అధికారి అహ్మద్‌కు శనివారం బీఆర్‌ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం డ్రా పద్ధతిలో లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు కేటాయించిందన్నారు. కాగా నేటికీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదన్నారు. పేదలు ఇంటి అద్దె చెల్లించే స్థోమత లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ మోదీతోనే దేశ అభివృద్ధి

చిన్నకోదూరు(సిద్దిపేట): ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశ భద్రత, అభివృద్ధి సాధ్యమని బీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ముచ్చర్ల నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్ అన్నారు. శనివారం చిన్నకోదూరులో బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. మండల పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా అక్కి సంతోష్ కుమార్, బస్వరాజ్ మహేష్, ఉపాధ్యక్షులుగా పర్శరాములు, రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, సంపత్, కార్యదర్శులుగా రమేష్, ఎల్లం, రవీందర్, నాగరాజు, నరేందర్, యువమోర్చా మండల అధ్యక్షులుగా మాతంగి నాగరాజు, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా బట్టు తిరుపతి, సోషల్ మీడియా కన్వీనర్‌గా సురేందర్ ఎన్నికయ్యారు.

◆ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

హుస్నాబాద్‌రూరల్: పల్లెల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. శనివారం మీర్జాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, మహ్మదాపూర్‌లో రూ.18 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ పనులను ప్రారంభించారు.

◆ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శనివారం చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ దామోదర్ మాట్లాడుతూ మండల పరిధిలోని పాత దొమ్మాట శివారు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేయగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.

◆ విద్యుత్ స్తంభం ధ్వంసం

బెజ్జంకి(సిద్దిపేట): హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న డీసీఎం మండలంలోని తోటపల్లి శివారు రాజీవ్ రహదారిపై శనివారం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గాయపడటంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. స్తంభం ధ్వంసమవడంతో దేవక్కపల్లె గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

◆ విద్యుత్ సరాఫరా బంద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, 11కేవీ లైన్ నిర్వహణ కారణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతం, నీలకంఠేశ్వర దేవాలయం, ఇందిరానగర్, ఎన్‌జీఓస్ కాలనీ, పోచమ్మ వీధి, రూరల్ పోలీస్‌స్టేషన్, శ్రీరామ్ నగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ నేడు డీఎస్సీపై అవగాహన సదస్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రైస్ సక్సెస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గోవర్దన్ రెడ్డి, శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఏపీలోని కృష్ణాజిల్లా అవనిగడ్డ, హైదరాబాద్ నుంచి నిష్ణాతులైన అధ్యాపకులు వస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 94400 05030, 97031 13448 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

◆ స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిన్నకోదూరు(సిద్దిపేట): బాల్య స్నేహితుడి కుటుంబానికి స్నేహితులు చేయూత అందించారు. చిన్నకోదూరు గ్రామానికి చెందిన యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి మిత్రులు అతడి కుటుంబానికి బాసటగా నిలిచారు. 1990–91బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు యాదగిరి కుటుంబాన్ని శనివారం పరామర్శించి తమవంతు సాయంగా రూ.65 వేలు అందజేశారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

గజ్వేల్‌రూరల్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ గజ్వేల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గజ్వేల్ డివిజన్ ప్రాంతీయ సర్వసభ్య సమావేశాన్ని గజ్వేల్‌లో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహిపాల్‌రెడ్డి, కార్యదర్శిగా చంద్రయ్య ఎన్నికయ్యారు.